క్లుప్తంగా

హైలెవల్ కెనాల్ నిర్వాసితులకు త్వరలోనే పరిహారం

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



పీఎస్‌పల్లి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన పడమటినాయుడుపల్లి రైతులు, నిర్వాసితులకు త్వరలోనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. పడమటినాయుడుపల్లికి చెందిన పలువురు రైతులు శుక్రవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో కలిసి తమ సమస్యలను ఆయనకు వివరించారు. గత దశాబ్ద కాలంగా తమ గ్రామానికి చెందిన రైతులకు తెలుగుగంగ అధికారులు కనీసం అవార్డు కూడా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రెండు రోజుల్లో తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మతో మాట్లాడి నిర్దేశిత కాలపరిమితిలోగా పీఎస్‌పల్లి నిర్వాసితుల భూములకు అవార్డు ప్రక్రియ వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఎంపీ వేమిరెడ్డిని సత్కరించిన సర్పంచ్‌లు, నాయకులు

నెల్లూరు (దర్గామిట్ట): కావలి నియోజకవర్గంలోని అల్లూరు, బోగోలు మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, నాయకులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ స్థితిగతులు, నాయకుల సమస్యలను ఎంపీ వేమిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఎంపీ దృష్టికి తెచ్చిన సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలకు పరిష్కారం చూపుతాయని, నాయకులు సమష్టిగా పని చేసి వచ్చే ఎన్నికల్లో గెలిచే విధంగా కష్టపడాలని దిశానిర్దేశం చేశారు. పలు పంచాయతీల సర్పంచ్‌లు తాగునీటి సమస్యపై ప్రస్తావించగా వాటిపై కూడా దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పక్కాగా ఓటర్ జాబితా సర్వే

• ఆర్డీఓ శీనానాయక్



వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

అల్లూరు: క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా సర్వే పక్కాగా, వివాదాలకు తావులేకుండా చేపట్టాలని ఆర్డీఓ శీనానాయక్ బీఎల్‌ఓలు, సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ఇస్కపల్లి సచివాలయం–2లో జరుగుతున్న ఓటర్ జాబితా వెరిఫికేషన్ ప్రక్రియను ఆర్డీఓ పరిశీలించారు. ఓటర్ జాబితా పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు త్వరితగతిన పూర్తిచేయాలని, చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సంబంధించిన యాప్ పని చేసే విధానాన్ని వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ వీరేంద్ర, డాక్టర్ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, సర్పంచ్ రంజిత్, నాయకులు బీద రమేష్ పాల్గొన్నారు.

నాగలపాటికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకున్న ప్రతాప్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పంటవీధిలోని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కలాం, టి రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నగదు ప్రోత్సాహకాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు తాళ్లూరు శ్రీనివాసులు జ్ఞాపకార్థం చుంచులూరు గ్రామానికి చెందిన ముక్కు ప్రమీల శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థులు నవ్యశ్రీ, ఆకాష్, చంద్రికలకు వరసగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు వంతున పంపిణీ చేశారు. ఎంఆర్‌పీ కలిశెట్టి రాజేంద్రకుమార్, హెచ్‌ఎం సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మను చేసి.. జీవం పోసి..

తొలి పూజలు అందుకునే గణనాథుడి విగ్రహాల తయారీలో రాజస్థాన్ కళాకారులది అందె వేసిన చెయ్యి. వివిధ రూపాల్లో గణపతి బొమ్మలు చేసి జీవకళ ఉట్టిపడేలా రూపొందిస్తున్నారు. వినాయక చవితిని ఊరూర, వీధి వీధిన అట్టహాసంగా జరుపుకుంటున్నారు. ఏడాదికొక్కసారి జరిగే వ్యాపారానికి ఏడాదంతా కష్టపడి విగ్రహాలు తయారీ చేస్తున్నారు. బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి ఆత్మకూరు ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ ఇంటిల్లపాది కష్టపడి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో బొజ్జ గణపయ్య విగ్రహాలు భక్తులకు అందిస్తున్నారు.



రాజస్థాన్ కళాకారులు షెడ్లలో తయారు చేసి విక్రయానికి సిద్ధం చేసిన విగ్రహాలు

- వినాయక విగ్రహాల తయారీలో కళాకారులు
- బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి వలస
- ఇంటిల్లపాది విగ్రహాల తయారీలోనే నిమగ్నం

ఆత్మకూరు: సోమవారం వినాయక చవితి నేపథ్యంలో ఇప్పటికే పల్లె నుంచి పట్టణాల వరకు వీధికొక గణపతి మండపాలు సిద్ధమయ్యాయి. అయితే మండలపాల్లో ప్రతిష్ఠించేందుకు విగ్రహాల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నాలుగు చోట్ల షెడ్లు ఏర్పాటు చేసుకుని రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఆరు నెలలుగా వినాయ విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. అడుగు నుంచి పది అడుగుల విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కొబ్బరిపీచు, అర్కలిక్ రంగులతో ఆకర్షణీయంగా విగ్రహాలు రూపొందిస్తున్నారు. సుమారు పది లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి ఒక్కో షెడ్డులో వంద నుంచి 120 విగ్రహాలు తయారు చేస్తున్నారు. విగ్రహాలు అన్ని అమ్ముడుపోతే రూ.12 నుంచి రూ.14 లక్షలు వస్తుందని ఖర్చులు పోనూ రూ.2 లక్షలు లేదా రూ. 3 లక్షల మిగులుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇంటిల్లపాది విగ్రహాల తయారీలో కష్టపడుతున్నారు. రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన జమునా రాథోడ్ అనే మహిళ తన కుటుంబంతో సహా వచ్చి గత పదేళ్లుగా ఆత్మకూరు ప్రాంతంలో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపింది.



గణేష్ విగ్రహాలకు పెయింటింగ్‌తో తుది మెరుగులు దిద్దుతున్న వేస్తున్న రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన జమునారాణి

ఈ ఏడాది కొత్తగా..

షెడ్లు ఏర్పాటు చేసుకుని వినాయక విగ్రహాలు తయారు చేసి విక్రయించడం ఆనవాయితీగా ఉంటున్న క్రమంలో ఈ ఏడాది కొత్తగా ఆత్మకూరుకు చెందిన భార్గవి దూర ప్రాంతాల్లో తయారు చేసిన విగ్రహాలను తీసుకొని వచ్చి విక్రయిస్తోంది. ఇవి కొంత ఆకర్షణీయంగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు వినాయక మండపాల నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో విగ్రహం రూ.14 వేలు నుంచి రూ.35 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.



ఇతర ప్రాంతాల నుంచి విగ్రహాలు తెచ్చి ఆత్మకూరులో విక్రయిస్తున్న యువతి భార్గవి

లంబోదర జీవ'కళ'

- విభిన్న రూపాల్లో గణనాథుని విగ్రహాలు
- రెండు దశాబ్దాలుగా విగ్రహాల తయారీనే జీనాధారం



వివిధ రూపాల్లో గణనాథుడి విగ్రహాలు

చేజర్ల: అలనాడు కైలాసాన పార్వతీదేవి బొమ్మను చేసి ప్రాణం పోస్తే.. పరమేశ్వరుడు గజాననుడి తలతో గణనాథుడికి రూపమిస్తే.. ఇలలో కళాకారులు లంబోదరుడి బొమ్మలు తయారు చేసి జీవం పోస్తున్నారు. పల్లెలు, పట్నం తేడా లేకుండా వాడవాడలా గణనాథులను ప్రతిష్ఠిస్తారు. చేజర్ల మండలం ఆదూరుపల్లి సెంటర్ రెండు చోట్ల గణేశ్ విగ్రహాలను తయారు చేస్తున్నారు. సుమారు 5 అడుగుల నుంచి 13 అడుగుల వరకు ఈ గణపతి విగ్రహాలను వివిధ డిజైన్లలో రూపొందిస్తున్నారు. ఊరువాడా ఏకమై చిన్న పెద్దా అందరూ కలిసి సంతోషంగా నిర్వహించుకుని పండగ వినాయక చవితి. విఘ్నాలను తొలగించి చేయబోయే పనులు అనుకూలంగా ఉండేలా గణనాథుడిని పూజిస్తారు. ఎందరో కళాకారులు, మరికొందరు వంశ పారపర్యంగా విగ్రహాలను తయారీని అందిపుచ్చుకుని అదే జీవనాధారంగా జీవిస్తున్నారు. చేజర్ల మండలంలో రెండు దశాబ్దాల నుంచి గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల ఆదూరుపల్లిలో దగ్గర ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా, జీవం ఉట్టి పడేలా గణపతి విగ్రహాలను సిద్ధం చేశారు. చేజర్ల, కలువాయి, సోమశిల, అనంతసాగరం, పొదలకూరు నెల్లూరు ప్రాంతాల నుంచి యువకులు ఇక్కడికి వచ్చి బొమ్మలు కొనుగోలు చేస్తున్నారు. 5 నుంచి 13 అడుగుల వరకు విగ్రహాలు చేస్తున్నారు. పండగ సమీపిస్తుండంతో విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద రద్దీ వాతావరణం ఏర్పడింది.



గణపతి విగ్రహానికి పెయింటింగ్ వేస్తున్న కళాకారుడు

పేద ప్రజల సంరక్షకుడు సీఎం జగన్



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమారెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకునేందుకున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని బుడమగుంటలో ఎమ్మెల్యే శుక్రవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను తెలియజేసి, వారు లబ్ధి పొందిన పథకాల బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంధ్రప్రదేశ్ కోసం ప్రతి కుటుంబానికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని అవసరమైన వారికి చికిత్స అందే బృహత్తరమైన 'జగనన్న ఆరోగ సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప ఆశయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారన్నారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా గృహస్తుల ఆరోగ్య స్థితిగతులు ఆరా తీసి వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తిస్తారని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 30వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి రోజూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి 14 రకాల వైద్య సేవలు అందిస్తారని, 105 రకాల మందులను ఉచితంగా అందిస్తారని వివరించారు. 30 రోజుల పాటు విలేజ్ క్లినిక్‌ల్లో జరిగే మెడికల్ క్యాంప్‌ల్లో మెరుగైన వైద్య సేవలు అసరమైన వారిని గుర్తించి వారికి ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. గతంలో ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లోని ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదని, నేడు వైఎస్ జగన్ తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలతో దివంగత వైఎస్సార్ ప్రతి పేదవాడి గుండెలో నిలిచిపోయారన్నారు. వైఎస్ జగన్ మరో రెండు అడుగులు ముందుకు వేసి విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌తో తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యంగా కోవిడ్ వంటి సంక్షోభాన్ని ఎదుర్కొని దేశంలోనే అత్యుత్తమ సేవలు అందించేలా ఏపీని నిలిపారన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, జనిగర్ల మహేంద్రయాదవ్, కుందుర్తి కామయ్య, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కసపర్తి రాజశేఖర్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నంబూరి వెంకటేశ్వర్లురెడ్డి, పలకా వెంకటేశ్వర్లురెడ్డి, వేమిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వేలమూరి జగదీష్‌రెడ్డి, పులిమి గోపాల్‌రెడ్డి, మేదరమెట్ల జయరామిరెడ్డి, శెట్టిపల్లి రమేష్, గుండాబత్తిన వెంకట్రావు, దావులూరి మాలకొండయ్య, మండలి కృష్ణారావు, ఆత్మకూరి రాజేష్ షేక్ జానీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

సునిశిత పరిశీలన, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

• ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించడంతో పాటు ప్రశ్నించే తత్వం అలవర్చుకున్నప్పుడే సబ్జెక్ట్‌పై పట్టు ఏర్పడుతుందని, తద్వార పరీక్షల్లో సులభతరంగా ఉత్తీర్ణత సాధించవచ్చునని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విక్రమ్‌రెడ్డి తొలుత ప్రఖ్యాత ఇంజినీర్ దివంగత మోక్షగుండ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజినీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ పలు అంశాల వివరిస్తూ వారి దగ్గర సమాధానాలు రాబట్టారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీర్స్ డేను భారత్, శ్రీలంక, టాంజానియా మూడు దేశాల్లో ఏటా నిర్వహిస్తారన్నారు. ఆత్మకూరు వంటి వెనుకబడిన ప్రాంతం నుంచి మౌలిక వసతులు లేని కాలంలో సుమారు 30 ఏళ్ల క్రితమే డీఆర్‌డీఓ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తదితరులు ఇంజినీర్లుగా రాణించారన్నారు. ప్రస్తుతం అవకాశాలు పెరిగాయని, వాటిని అందిపుచ్చుకుని ఇంజినీర్లుగా ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. ఆసక్తి పెరిగినప్పుడే విషయ పరిజ్ఞానం తెలుసుకోవచ్చునని, ఆలోచన ధోరణి పూర్తిగా విషయ పరిజ్ఞానంపై ఉండాలన్నారు. ఏడీఎఫ్ ఏర్పాటు చేసి ఆత్మకూరును అభివృద్ధి చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వందలాది ఉద్యోగాలు సాధించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 2న మరో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇంజినీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, కౌన్సిలర్లు పి.పెంచలయ్య, మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



బుడమగుంట ఎస్సీ కాలనీకి తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలో నిరుపేదలు నివాసం ఉంటే 16వ వార్డు బాలకృష్ణారెడ్డినగర్, 17వ వార్డు ఎస్సీ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. బాలకృష్ణారెడ్డినగర్‌లో రూ.26 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. బాలకృష్ణారెడ్డినగర్‌లో నివాస ప్రాంతాలను చుట్టుముట్టిన డ్రైనేజ్ తరలించేందుకు రూ.5 లక్షలతో పూడిక తీసే పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. 17వ వార్డులోని బుడమగుంట ఎస్సీ కాలనీలో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతుంటే, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని తరలించేందుకు అవసరమైన లింక్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్, పబ్లిక్ హెల్త్ డీఈ విజయలక్ష్మి, మున్సిపల్ డీఈ సాయిరాం, ఏఈలు శ్రీనివాసులురెడ్డి, షైనీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, పేరం వెంకటేశ్వర్లు, గుడ్లూరు మాల్యాద్రి, నగ్గళ్ల శ్రీనివాసకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమదారులపై చర్యలు తప్పవు



ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉదయగిరి: పట్టణ సమీపంలోని కావలి మార్గంలో ఉన్న ఎస్టీ కాలనీలో సర్వే నంబర్ 1282/4లో ఉన్న 1.88 ఎకరాల ప్రభుత్వ అనాధీన భూమిని ఆక్రమించి కట్టడాలు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ జగదీష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో ఆక్రమణలను, అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమించి కట్టడాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణ జరిగిన భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట వీఆర్వో అంజాద్ ఉన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటేశ్వర్లు

ఆత్మకూరు: భారతదేశానికి చెందిన విశ్వవిఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంజినీర్స్‌డే నిర్వహించారు. జలవనరులశాఖ ఈఈ కార్యాలయంలో ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇంజినీర్‌గా విశ్వేశ్వరయ్య సాధించిన విజయాలను పేర్కొన్నారు. సోమశిల నాలుగో డివిజన్, పీఆర్ కార్యాలయాల్లో ఇంజినీర్స్ డే నిర్వహించారు.



అల్లూరు: విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పిస్తున్న ఏఈ కిరణ్

మోక్షగుండంకు ఘన నివాళి

అల్లూరు: ఇంజినీర్స్ డే సందర్భంగా స్థానిక పీఆర్ఏఈ కార్యాలయంలో ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాల సృష్టికర్త, ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ కిరణ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. మనదేశ ఖ్యాతిని నలు దిశలా చాటి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన భారత జాతి గర్వించదగ్గ ముద్దు బిడ్డ మోక్షగుడం విశ్వేశ్వరయ్య అన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరం సచివాలయం పరిధిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శని, ఆదివారాల్లో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొంటారని మేకపాటి కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు సాహో ఫౌండేషన్ ప్రారంభం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): తల్లీ లేదా తండ్రి లేదా తల్లిదండ్రులు ఇద్దరూ లేని పిల్లలకు సహాయ సహకారాలు అందించే ఉద్దేశంతో మర్రిపాడులో శనివారం సాహో ఫౌండేషన్ ప్రారంభిస్తున్నామని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌బీసీహెచ్ ఈబీఐటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత, పడమటినాయుడుపల్లికి చెందిన పడచల నాగేశ్వరరావు ఫౌండేషన్ స్థాపిస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీతో చాప్‌కట్టర్

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చాకలకొండ ప్రాథమిక పశు వైద్యశాల పరిధిలోని పశు పోషకులకు సబ్సిడీతో గ్రాసం కత్తిరించే చాప్ కట్టర్ అందజేస్తున్నట్లు పశు వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిట్ ఖరీదు రూ.33,970 కాగా రైతులకు రూ.20,382లకే అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకుని పొందవచ్చన్నారు.

పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

• జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 టీచర్లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్య

కావలి: పిల్లల్లో పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని కావలి డివిజన్ ఉప విద్యాశాఖధికారి రఘురామయ్య ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని అన్ని పాఠశాలలకు చెందిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా పాఠశాల విద్యాశాఖ సహకారంతో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ శాస్త్రీయ ప్రాజెక్టు పోటీలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. అడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మారుతీ కేశవకుమార్ వివిధ రకాల శాస్త్రీయ కార్యక్రమాలపై ఉపాధ్యాయుల బాధ్యతను వివరించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రిసోర్స్ పర్సన్ ఏ ప్రభాకర్ ఈ ఏడాది ప్రధాన అంశం, ఉప అంశాలను వివరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎంవీ రమణయ్యనాయుడు విజ్ఞాన శాస్త్రం బోధనలో వినూత్న పద్ధతులను విశదీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకట సుబ్బయ్య, గోవిందయ్య డివిజన్‌లో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలు, పాఠశాలల్లో విద్యుత్ శాఖ జిల్లా విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఏడున్నర గంటల వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ విజిలెన్స్ అధికారులు (డీఈలు) జగదీష్‌రెడ్డి, సుధాకర్‌తో పాటు ఇద్దరు ఏడీలు, ఇద్దరు ఏఈలు, సిబ్బంది ఆత్మకూరుకు చేరుకొని స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని సహాయకులుగా తీసుకుని గ్రూపులుగా విడిపోయి మినరల్ వాటర్ యూనిట్‌లు, ప్రైవేట్ పాఠశాలలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నాలుగు ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యం జరుగుతున్న విషయం గుర్తించి భారీగా జరిమానాలు విధించేందుకు కేసులు నమోదు చేశారు. ఓ పాఠశాలలో అధిక లోడ్ విద్యుత్ వినియోగిస్తున్న విషయాన్ని గుర్తించి అదనపు లోడ్‌కు నగదు చెల్లించాలని ఆదేశించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కావలి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజారవాణా సంస్థ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు 9959225643 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇచ్చి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు. ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలు, రాయితీలు తెలుసుకుని కావలి డిపో అభివృద్ధికి దోహదపడాలని డీఎం కోరారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెనరా బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్ కెనరా విద్యాజ్యోతి పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందించారు. పాఠశాల హెచ్‌ఎం బుజ్జయ్యతో కలిసి పాఠశాలలో ప్రతిభ కనబరిచిన 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవడం పాటు విద్యార్థులను విద్యా పరంగా ప్రోత్సహించడానికి కెనరా బ్యాంకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ పీఓ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.